

# గోవిందమ్మ పాన్‌షాప్

శివల జగన్నాధరావు

ప్రాతికేళ్ళ వరకు జీవితంలో అనేక విషయాల్లో చచ్చుగా వ్యవహరించిన గోవిందం, ఆ తరవాత పెళ్ళి విషయంలో మట్టుకు గొప్పసాహసం చేశాడు. తమ వీధిలో వున్న సుందరమ్మని గాఢంగా ప్రేమించి, ఒట్టి ప్రేమతో తమకాన్ని ఓపజాలక లేపుకు పోయాడు. అప్పటిదాకా ఓ మోస్తరు కష్టాలు పడిన వాడల్లా సాహసం చేశాక సిసలైన కష్టాల్ని ఎదుర్కొన్నాడు. ఇద్దరి తండ్రులూ వాళ్ళెక్కడ వుంటున్నారో వెతుక్కుంటూ వెళ్ళి ఇద్దర్ని నోళ్ళు నెప్పెట్టేవరకు తిట్టిపోసేరు. ఇళ్ళకి వొచ్చెయ్యమన్నారు.

> కిళ్ళీబడ్డీ వ్యాపారం మొదలెట్టిన వారు భార్యకు వక్కపొడి పొట్లాలు, పిల్లలకు మిఠాయిలు అందివ్వక పోతే ఏదో ఒకనాడు బ డ్డీ బ డ్డీ గల్లంతుగాక ఏమౌతుంది?


పెద్దలు చేతిమీదుగా పెళ్ళిచేసే పక్షంలో వస్తామన్నారు. సుందరమ్మా, గోవిందమూనూ, అఫళంగా - పెద్దవాళ్ళు అగ్గిరుద్రులై పోయి తిట్లూ, శాపనారాలు మంత్రాలూ, అక్షింతలూ కాగా దెబ్బలపెళ్ళి చేసి వెళ్ళిపోయేరు. మీ ఖర్మం మీరు అనుభవించండన్నారు. గోవిందానికి అల్లుడి పౌరుషం వొచ్చి మామగార్ని రెండన్నాక. వెంటనే నాలుగు తన్నాడు. ఆరాత్రి మొగుడూపెళ్ళాం ఒకర్నొకరు ఓదార్చుకున్నారు. అప్పటికి బియ్యేపాసయి ఓ చోట ఆక్టింగ్ జాబ్ చేస్తున్న గోవిందాన్ని, పెళ్ళయిన మూణ్ణెల్లలో వాళ్ళు తీసేశారు. అక్కణ్ణించి అతను చూడని పేపరూ, పెట్టని అప్లికేషనూ, ఎక్కిదిగని ఆఫీసు గడపా లేవు. భవిష్యత్తు అగమ్యగోచరమైపోయింది. వున్న ఇంటికి అద్దె కట్టకపోతే ఇంటియజమాని ఇరవై నాలుగ్గంటల్లో ఇల్లు వదిలి పొమ్మన్నాడు. అయిన వాళ్ళని పెళ్ళి విరోధుల్ని చేసింది. స్నేహితుణ్ణి చేబదులడిగితే 'నీ కుద్యోగం ఏదీ లేదుగదా. ఏ ఆశ చూసుకు అప్పిమ్మంటావ'న్నాడు. గోవిందం సుందరమ్మ చేతులు పట్టుకున్నాడు. రెండు చేతుల్నీ రెండుజతల గాజుల్తో - మెళ్ళోపొళ్ళ నెక్లెసుతో - చెవుల్ని ముత్యాల జూకాల్తో సుందరమ్మ అతనికి ఆపదమొక్కులవాడిలా కనిపించింది. 'పాహిమాం' అన్నాడు. బుర్ర అడ్డంగా తిప్పింది సుందరమ్మ. చస్తే బంగారం ఇవ్వనంది. గోవిందం

కోపంవొచ్చి ఎగిరేడు. ఇద్దరూ కీచులాడుకున్నారు. ఈ పరిస్థితిలో ఆ వూరొదిలి, ఈ వూరొచ్చి మా ఇంట్లో-ఓ చిన్నవాటాలో దిగారు. ఏం కీచులాడినా సుందరమ్మ గాజు కుదువ బెట్టక తప్ప లేదు; తనకి ట్యూషన్స్ కుదర్చమని ప్రాధేయపడగా గోవిందానికి నలుగుర్ని కుదిర్చేను. క్రమంగా వాళ్ళు పదిమంది అయేరు. గోవిందానికి సంసారం పెరుగుతోంది. ఆదాయం చాలటంలేదని గోల పెట్టేవాడు. ట్యూషను పిల్లలు కొందరు బళ్ళో మాస్టర్ల చేత చెప్పించుకుంటామని చెప్పి మానేశాడు. ఉద్యోగం కోసంచేసే ప్రయత్నం, ప్రయత్నంలోనే వుండిపోయింది. రెకమెండేషన్లు, ముడుపులు లేక సమాజంలో అట్టడుగున వుండిపోయిన దురదృష్టవంతుల జాబితాలోకి గోవిందం చేరిపోయేడు. ఓ కొట్లో పద్దు వ్రాసే పని ఎట్లాగో సంపాయించి. ఆ గొర్రెతోక జీతంతో, నీరసంగా జీవితాన్ని తీసుకువెళ్ళే గోవిందం దృష్టి- వున్నట్టుండి కిళ్ళీబడ్డీ సత్తిరాజుపైన సెర్చిలైట్‌లా పడింది.

సత్తిరాజు వెడల్పాటి ముఖంతో, నొక్కులజుత్తుతో, మూతిమీద ఈగ వాలినట్టున్న మీసంతో, సర్వదా చిరునవ్వుతో కడుపునిండా విందుభోజనం చేసి, కమ్మటి కిళ్ళీ, ఖరీదైన సిగరెట్ బిగించిన వాడిలా నిబ్బరంగా ప్రశాంతంగా కనిపిస్తాడు. ఆలాగని సత్తిరాజు ధర్మరాజేమీ కాదు. అతన్లోని ఆవేశం, ఆగ్రహం వగయిరా మసాలా దినుసుల్లాంటి గుణాలున్నాయి. ఆయితే మామూలు వాలుగంటుల చూపులికి చలించక, దేవకన్యల హొయలకి మాత్రమే చలించే పవర్‌ఫుల్ మునీశ్వరునిలా అతను తనకంటే అధికుల ఆగ్రహానుగ్రహాలకు మాత్రమే వశ్యుడవుతాడు. అతను ఎవరి మాటయినా ఆలకించేడంటే వాళ్ళు కులంలోనో, సంపదలోనో అతనికంటె ఎక్కువయి వుండాలి

సత్తిరాజు కిళ్ళీబడ్డీ ఎట్లా లేపేడో, ఇప్పుడెట్లా సుఖపడుతున్నాడో నేను చెబితే, గోవిందానికి సత్తిరాజు మీద ఇంట్రెస్టు మరింత పెరిగింది. రోజూ భుజాలు పడిపోయేలా ఇరవై ముప్పయి కావిళ్ళ నీళ్ళు చుట్టుపక్క లందరిళ్ళల్లోకి మోసేవాడు. మండుటెండల్లో, వణుకుచలిలో, ముంచెత్తే వర్షాల్లో అలసట అన్నది ముఖంలో కనబడనియ్యని అతడు పడే శ్రమ చూస్తే నా మనసు జాలితో నిండిపోయేది. పడేకష్టం కంటే, ఏదో లక్ష్యానికి చేరుకోవాలన్న తపనే అతడి వదనం వ్యక్తమయ్యేది.

సత్తిరాజు పెళ్ళాం నాలుగిళ్ళల్లో పాచి పని చేసేది. రాబడికంటె ఖర్చు తక్కువ వాళ్ళకి. నెమ్మదిగా ఓ గేదెని కొన్నాడు సత్తిరాజు, పాలవ్యాపారం మొదలెట్టేడు పెళ్ళాన్ని పాచిపని మాన్పించి పాలమ్మకం చూసుకోమన్నాడు. ఆ తర్వాత మరో గేదెని కొన్నాడు. తను నీళ్ళమోత మాన




తుండానే పాల వ్యాపారం సాగించేడు. ఉన్నట్టుండి ఆ సెంటర్లో ఓ రోజు కిళ్ళీ బడ్డీ లేపేసేడు! ఇప్పుడు నీళ్ళ మోత మానేసి కొట్టుమీదే కూచుంటున్నాడు. ఓ పక్క పాలవ్యాపారం. మరోవైపు కిళ్ళీబడ్డీ వర్తకం! మునుపటి ముతక పంచె, బనీనూలేవిప్పుడు. ఇస్త్రీ చేసిన లాల్చీ. షరాయి తొడుక్కుని నీటుగా. గోటుగా తయారయి చిన్న రాజ్యానికిఅధిపతిలా ఆ కొట్టుమీద అధిష్టించి వుంటాడు.

సత్తిరాజు హిస్టరీ విని గోవిందం "బ్రతకడం ఎలాగో అలాంటి వాళ్ళకే బాగా తెలుస్తుంది. మనం మధ్య తరగతి వాళ్ళం వాళ్ళలా కష్టపడలేము. ఆ ఓపికా వుండదు...." అని ఆగి— "నాక్కూడా ఓ కిళ్ళీబడ్డీ లేపితే బావుంటు వనిపిస్తూందండీ— సత్తిరాజుతో సంప్రదించి ఆ పనేచేయాలింక...." అన్నాడు

నేను ఆశ్చర్యంగా చూశానతడి వంక.

"ఆశ్చర్యం ఎందుకండీ! నా స్థితిలో అంతకంటె మరో మార్గం కనిపించ ట్లేదు."

"బాగానేవుంది ఐడియాగాని డబ్బు వుండాలి గద కొట్టులే పటానికి!" అన్నాను.

అప్పటికి గోవిందం ఏం మాట్లాడ లేదుగాని అతనేదో నిశ్చయానికి వచ్చే ఈ తీర్మానం చేశాడనిపించింది. తర్వాత గోవిందం చెప్పాడు, భార్యతో బడ్డీలేపే

వుద్దేశాన్ని వెల్లడించేనని, ఆవిడి అదివిని రాగాలారంభించిందసీ: "మీకేదో గ్రిహం మారింది. కాకపోతే ఈ బుద్ధే మిటీ? మనం కిళ్ళీబడ్డీ పెట్టడం ఏమిటండీ? ఎప్పుడన్నా ఇలా చేశారా మన వాళ్ళు ఎవరన్నా?" అని నెత్తిమొత్తంకుంది।

"నీకు తెలీదు, సుందరం .... ఈ రోజుల్లో సౌఖ్యంగా కాలుమీద కాలేసుకు బ్రతకాలంటే ఏదయినా వ్యాపారం ఒక్కటే శరణ్యం అది బడ్డీ కానియ్యి, బఠాణీలమ్మటం కానియ్యి సత్తిరాజుని చూసేవా? ఎంత నిర్విచారంగా వున్నాడో" అన్నాడు,

"మీ వెర్రి బావుందిగాని అంత డబ్బెక్కడిదండీ ఇప్పుడు? కొంపనీసి....' అని ఆగిపోయింది సుందరమ్మ. భర్త ఏదో ఓషూగత్యం చేసేడనిపించి' ఆ మానసశానికి నోరాక్రి। గోవిందం భార్య వొంటి మీది బంగారం మదుపుపెడితే కిళ్ళీబడ్డీ లేస్తుందని చెప్పాడు. సుందరమ్మ బావురుమంది, పిల్లలందర్నీ దగ్గరికి లాక్కుని ఏదో అన్యాయం జరిగినట్టు శోకాలుపెట్టింది. గోవిందం వూరుకోలేదు, సుందరమ్మని బ్రతిమిలాడేడు. "ఈ ఆలోచన నా కెందుకు పుట్టించేదో. దేవుడు? మనకి ముందు మంచి రోజాలా సన్నమయ్యే యోగం వుంటే ఈ ప్రయత్నం తలపెడుతున్నానేమో? కొట్టు వృద్ధి అయ్యాక మన సొమ్మేవడు తినాలే అప్పుడు?" అన్నాడు. ఇంకా చాలా రకాలుగా భార్యకి నచ్చ చెప్పి ఒప్పించేడు.

"ఈ కొట్టు మాటకేం గాని- ఆవిడ బంగారం మీకుద్యోగం వచ్చేందుకు వుపయోగించుకోలేక పోయేరా?" అన్నాను నవ్వుతూ.


గోవిందం చాలా చికాగ్గా అయిపోయి- "ఆ వెధవ వుద్యోగం గురించి ఇంక చెప్పకండి" అన్నాడు। సత్తిరాజూ, నేనూ. గోవిందం బడ్డీలేపే ప్రయత్నంలో పడ్డాం. ఎల్లాగయితేనేం పాన్ షాపు తయారైంది. పంచాంగం చూపి వారం తిథి మంచిది నిర్ణయించి, షాపు ఓపెన్ చేశాం. గోవిందం రంగుల్తో ఆకర్ష

## హెల్పింగ్ హేండ్ రబ్బర్ బేండ్

● "ఎవరైనా రబ్బర్‌బాండ్ వేసిన నోట్లకట్ట పారేసుకున్నారా?" అని అడిగాడొక పెద్ద మనిషి బ్యాంక్‌లో.

"ఔను....నాది....నాది!" అని అనేక కంఠస్వరాలు ఒకేసారి వినిపించినై.

"అల్లాగా? నాకు రబ్బర్‌బాండ్ మాత్రమే దొరికింది....ఎవరిదో తీసుకోవచ్చు" అన్నాడా పెద్దమనిషి.




జీయంగా బోర్డు రాయించి తగిలించేడు "గోవిందమ్ పాన్‌షాప్."

అయినవాళ్ళు కొందరు రకరకాలుగా గోవిందాన్ని విమర్శించేరు. వాళ్ళ వంశంలో ఎవరూ ఇలాంటి పని తలపెట్టలేదన్నారు 'వాడికీ నాకూ వర్తకమేమిటి?' అన్నారు. వెనకటికి తమ వంశజుడే ఒకడు ఏదో వ్యాపారం చేస్తానన్చెప్పి బోలెడంత మదుపుపెట్టి దివాళా తీసి, ఆయింతా ఆ బెంగతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గోవిందం సీరస పడిపోయేరు. కొందరు స్నేహితులు షాప్ తెరిచినందుకు వచ్చి అభినందించేరు.

"నీలాంటి సాహసవంతులు బయల్దేరితే జనం వుద్యోగానికి ఎగబడక స్వయం కృషితో బ్రతకడం నేర్చుకొంటారు" అన్నారొకరు.

"ఏదీ, నాలుగు మిఠాయికిళ్ళీలు కట్టించండి సార్. మాంచి పసందుగా వుండాలండోయ్. బావుంటే మీకు పైసా ఇవ్వక్కర్లేకుండా అడ్వర్టయిజ్ చేస్తాం...."

"అరటిపండు బావుంది గాని ఆరు పైసలికి ఒకటమ్మితే ఇంకా బావుంటుందేమో! బొత్తిగా మొదట్లోనే ధర ఎక్కువ పెట్టేసుడ మేమి ఉంటారా...." తినిన అరటితొక్క పారేస్తూ ఓ ప్రబుద్ధుని సలహా.

అయిదుగురు అయిదు నిమిషాల్లో రెండు పాకెట్ల సిగరెట్లు వూదేశారు. కొందరు సోడాల్తో దాహం తీర్చుకున్నారు.

''నాకీ వస్తువులేం వూరికే రాలేదు. మీ సలహాలికి వందనాలు. మీ అభినందనలకి నమస్కారాలు. వెళ్ళండిబాబూ! వెళ్ళండి!'' అని అందామని గోవిందం నోరు విప్పబోతే విడదే! ఎలా విడుతుంది? వారిలో ఒకరు రెండు నెలల క్రితం చంటివాడికి ఒంట్లో బాగోలేకపోగా ఇంజెక్షన్ కొనడానికి అప్పుకోసం వెళితే ఆదుకొన్న మహానుభావుడు! మొన్నటికి మొన్న ప్రొద్దున్న కాఫీలోకి పంచదార లేకుంటే. సుందరమ్మ బయలుదేరగా గరిటెడు పంచదార యిచ్చి. కాఫీ తాగనిచ్చిన పక్కింటావిడ భర్త ఇల్లితనే! ప్రైవేటు కుర్రాళ్ళతో అందరూ పోగా ఒక్కడు ఇంకా మిగిలినవాడి ధర్మంవా అని పది రూపాయలు ముట్టచెబుతున్నాడు వాడి తండ్రీ-తన హితవు కోరేవాడూ ఇదిగో ఇతనే!! వీళ్ళని ఎలా పొమ్మనటం, ముఖం చూస్తూ?....గోవిందం సత్తిరాజు దగ్గరికి పరిగెత్తేడు!

''మొగమాటలకీ, వ్యాపారానికి అస్సలు జతకుదరదు సార్! తెల్సినోళ్ళని కరుణించేమంటే చిత్తయిపోయా మన్నమాటే! జాలిపడితే గోతిలో పడతాం! అంచాత ఎంతదగ్గరోళ్ళయినా చేరదియ్యకండి. మెలకువగా వుండకపోతే పైకి నెట్టుకురాలేరు సరిగదా మొదటిది మునిప్పొస్తుంది. ఇప్పుడు తైరుకొట్టే నా యాళ్ళే అప్పుడు యాళాకోళం చేస్తాడు'' అని హితోపదేశం చేశాడు సత్తిరాజు

గోవిందం ఇప్పుడు పరిచయస్థుల్ని లౌక్యం వుపయోగించి దూరంగా వుంచుతున్నాడు. ''వారానికి ఓ రోజు శెలవు ఇచ్చేదా నా వ్యాపారానికి?'' అని అడిగాడు నన్ను. కొట్టుకట్టేసి చేసేపని ఏముంది? ఆరంభంలో వీలయినంత అమ్మకం జరగాలి. అంచేత ఒక్కరోజు కూడా కొట్టుకట్టవద్దనిచెప్పాను. గోవిందం అప్పుడప్పుడూ తన పెద్దకొడుకు పదేళ్ళ వాడిని కొట్టుమీ దెక్కించుకొని ఏవస్తువు ఎంతకి అమ్మాలో చెబుతూ వస్తున్నాడు. సరుకులు పూర్తిగా అయిపోకుండానే కొనటం- మరీ ఆశకి పోకుండా, లాభానికి వేసి అమ్మటం- ఆ లెక్కలు డొక్కలు చూసుకోడం- ఇలా పూర్తిగా వర్తకంలో మునిగిపోయేడు మా గోవిందం! అప్పుడప్పుడు సుందరమ్మ తనబంగారం తల్చుకొని ఏడ్చి. ఇంట్లో యుద్ధంలేపుతూందని చెప్పేడు.

ఓ రోజు సుందరమ్మ భోంచేశాక రెండు వక్కపొడి పొట్లాలు తెమ్మని చిన్నకొడుకుసుబ్బిగాడిని కొట్టుకిపంపింది. వాడు వొస్తూనే పిప్పరమెంటు సీసాల మీద, అరటిపళ్ళమీద పడి అల్లరిచేశాడు. గోవిందం వక్కపొడి పొట్లం ఒక్కటి కూడా ఇవ్వలేదు సరిగదా. వాణ్ని రెండు తగిలించి పంపించేశాడు. రాత్రి ఇంట్లో పెద్దయుద్ధం అయింది!

''మీకు పిల్లాడు ఒచ్చేడన్న 'ఇది' (అంటే మమకారం అన్నమాట!) కూడా

లేకపోయిందన్న మాట! చిన్న వెధవ నాలికపీకి సీసాలమీద చెయ్యి వేసేదే అను కోండి.... విడిలించి కొడతారా? ఏం ఓ బిళ్ళఇస్తే ఏంపోయిదీ? పక్కవాడి పొట్లం నాకు ఇవ్వలేదని నేనేం అనుకోటంలేదు. చిన్న వెధవని కసిరితేనే నాకు బాధి స్తున్నాది. అంతేలెండి....మీ బుర్ర మారి పోయింది వుద్యోగం లేదు, సద్యోగం లేదు సరిగదా.... ఈ భాగోతం ఓటి పట్టు కొని.... వున్న బంగారమంతా మంటబెట్టి ....ఆఖరికి ఏం చేస్తారో?.... పిల్లలమీద అభిమానం చచ్చిపోయి.... నే నంటే లక్ష్యం లేకుండాపోయి...."

గోవిందం సహనంచచ్చిపోయి గట్టిగా కేకలేసి సుందరమ్మని రెండు వేశాడు. ఆవిడ పెంకు లెగిరేలా శోకాలు పెట్టింది. ఇద్దరూ ఘోరంగా సమరం సాగించారు. పిల్లలు అదిరిపోయి ఏడ్పులు ఆరంభిం చారు. ఆ కొంపలో పుట్టిన ఆ చిచ్చు ఎంతసేపటికో గాని ఆరలేదు!

* * *

'ఉన్నవా డుండక తనెందుకీ సాహ సము చేశాడు?' అనుకున్నాడు గోవిందం. ఈ మధ్య అతను విపరీతంగా బాధపడు తున్నాడు. కలత చెందుతున్నాడు.

సత్తిరాజు ఈ మధ్య తన షాపుని ఆకర్షణీయంగా మార్చాడు. రకరకాల పత్రికలు, పుస్తకాలు తెప్పించి విక్రయి స్తున్నాడు. బార్‌లైట్లు రెండు వేశాడు. రేడియో కొనిపెట్టేడు. షాపుకి రంగులు వేయించాడు. 'ముందుబుడ్లు' అన్నింటి కన్నా ఆకర్షణీయమైన పెద్దమార్పు! మజా మజా సరుకుల్తో సత్తిరాజు దివిటీలా వెలిగి పోతూంటే, ఆ పక్క గోవిందమ్ పాన్ షాపు గుడ్డిదీపంలా వెలవెలబోతూంది. గోవిందం గొంతులో వెలక్కాయ అడ్డ ముగా పడినట్టయింది. జనంఅంతా సత్తి రాజు షాపుకే వెళుతున్నారు. అతడి షాపు తనషాపుకి బాగా దగ్గరగా వుండటంవలన గదా తనషాపు తక్కువ స్పష్టం అవు తూంది? అనుకున్నాడు గోవిందం. గోవిందం పాన్‌షాపుకి రాబడి పడిపో యింది. వున్న సరుకులు చెల్లటంలేదు. పరిస్థితిలా వుండగా తండ్రి మరణించి నట్టు అతడిని వెంటనేరమ్మని టెలిగ్రాం వచ్చింది. కొడుకుని షాపులో కూచోపెట్టి వూరికి వెళ్ళేడు గోవిందం. ఆ అబ్బాయి తండ్రిపక్కనకూచుని ఇన్నాళ్ళూ షాపులో వస్తువులమీద తన అపేక్షని అణచుకొం టున్నాడు. ఇప్పుడు తండ్రి లేకపోగానే ధైర్యం వచ్చేసింది. తన స్నేహితుల్ని పిలిచి షాపులో తినగలిగిన సరుకులతో విందు చేసుకున్నాడు దాదాపు ఖాళీ! ఓ నాడు నేను అవైపు వెళ్ళి విస్తుపోయాను! గోవిందం కొడుకుని కనిపెట్టి వుండ మన్నాడుగాని నా వుద్యోగంతో పగలు అంతా తెరిపిలేకుండాపోయింది. గోవిందం వూర్నించి వచ్చేసరికి ఇక్కడి పరిస్థితి ఇలావుంది! గుండెబాదుకుని, కొడుకుని నాలుగుబాది, గోవిందమ్స్ పాన్‌షాపు బోర్డు తీసేశాడు గోవిందం. వ్యాపారం తనలాంటి వాళ్ళకి అచ్చిరాదని చెప్పాడు చింతిస్తూ.*